సాక్షి
పల్నాడు
శుక్రవారం । 10 । మార్చి । 2023



అభివృద్ధి పనుల పరిశీలన

రాజుపాలెం: దేవరంపాడు కొండపై వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం పరిశీలించారు.



నృసింహుని అలంకారోత్సవాలు

మంగళగిరి: లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు ఆస్థాన అలంకారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ రామకోటిరెడ్డి తెలిపారు.

ఒక కరోనా కేసు నమోదు



గుంటూరు మెడికల్: జిల్లాలో గురువారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు నమోదైంది. గుంటూరు నగరంలోని నగరంపాలెం పరిధిలో నమోదు అయింది. కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.

న్యూస్‌రీల్

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ మాధవరెడ్డికి ఐపీఎస్ హోదా



నగరంపాలెం(గుంటూరు): రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి నాన్‌కేడర్ (ఎన్‌సీ) ఎస్పీ నుంచి ఐపీఎస్ హోదా పొందారు. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ అయింది. 2021 ఆగస్టు 25న మాధవరెడ్డి గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఆయన 2006లో రేంజ్ అటవీశాఖ అధికారిగా నాలుగేళ్ల పాటు విధులు నిర్వహించారు. 2010లో గ్రూప్–1 ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. నిర్మల్ (మహబూబ్‌నగర్), ఆత్మకూరు (కర్నూలు), మంగళగిరి డీజీపీ కార్యాలయ టెక్నికల్ సర్వీసెస్, పోలీస్ అకాడమీలో ఫ్యాకల్టీగా విధులు నిర్వర్తించారు. 2018లో ఏఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. కర్నూల్ జిల్లా పరిపాలన, విజయవాడ సిటీ (ట్రాఫిక్) ఏడీసీపీగా, గవర్నర్ ఇన్ రాజ్‌భవన్ ఏడీసీగా విధులు నిర్వహించి, గుంటూరు జిల్లాకు బదిలీపై వచ్చారు.

టెన్త్ ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు గురువారం ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రీ-ఫైనల్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేలా పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 36,155 మంది విద్యార్థులకు ప్రీ-ఫైనల్ పరీక్షలు మొదలయ్యాయి. మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి.

11న తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. ఆమె గురువారం డీఈవో కార్యాలయంలో మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల ప్రగతి, విద్యా సంవత్సరం పొడవునా నిర్వహించిన పరీక్షల్లో సాధించిన మార్కులు, అభ్యసన సామర్థ్యంపై తల్లిదండ్రులతో చర్చించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

విద్యాశాఖాధికారి బదిలీ

నరసరావుపేట: ప్రభుత్వ ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి మేకతోటి వెంకటప్పయ్యను ప్రభుత్వం ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే స్కూలు ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

యార్డుకు 1,25,326 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,25,326 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,19,260 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర దక్కింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 84,740 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రగడల రహస్యమిదేనా!

- సత్తెనపల్లి, గుంటూరులో వర్గాల మధ్య పోరుకు ఆజ్యం
- ముందస్తు వ్యూహంతోనే గ్రూపుల కొనసాగింపా?
- పొరుగు నేతల బెర్త్ రిజర్వుకేనా ఎత్తుగడలు
- యువ నాయకులు, సీనియర్లలో అంతర్మథనం
- చంద్రబాబు తీరుపై ముఖ్యుల మండిపాటు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీలో అత్యంత సీనియర్ నాయకుడైన మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు 2019 సెప్టెంబరు 16న ఆత్మహత్య చేసుకున్నారు. సత్తెనపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆయన మరణం తరువాత అక్కడ టీడీపీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా తయారైంది.

గుంటూరు పశ్చిమం నుంచి గత ఎన్నికల్లో గెలుపొందిన మద్దాళి గిరిధరరావు టీడీపీకి దూరమయ్యారు. అప్పటి నుంచి అక్కడా సరైన నాయకత్వం లేదు. కోవెలమూడి రవీంద్రకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినప్పటికీ గ్రూపులను పెంచి పోషించడానికే టీడీపీ అధినాయకత్వం ప్రాధాన్యతనిస్తోందనేది నిష్ఠూరసత్యం.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి



నియోజకవర్గాలలో టీడీపీ నాయకుల మధ్య గ్రూపులు, గొడవలు వాటంతట అవే ఏర్పడి కొనసాగుతున్నాయా? లేక అధిష్టానమే గ్రూపులు ఏర్పడేందుకు దోహదపడి ఆపై వాటికి ఆజ్యం పోస్తోందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు పార్టీలోని ముఖ్య నాయకులు, సీనియర్ క్యాడర్ నుంచి వస్తున్నాయి. రాజకీయ పొత్తులు కుదురుతాయని, ఏదో ఒక పార్టీ నుంచి ఎవరో ఒకరు తరలివచ్చేస్తారని, బడా పారిశ్రామికవేత్తలో, ఎన్‌ఆర్‌ఐలో చేరిపోతారనే ముందస్తు అంచనాలు ఉన్నందునే గొడవలు రాజేయించడం, వాటిని కొనసాగింపజేయడం తమ అధినేతకు అలవాటేనని గత అనుభవాలను ఉదహరిస్తున్నారు. రాబోయే వారికి సీటు రిజర్వు చేయడం కోసం కొన్ని నియోజకవర్గాల్లో బహు నాయకత్వాన్ని పెంచిపోషించడం ముందు నుంచి ఉన్నదేనని విశ్లేషిస్తున్నారు.

సత్తెనపల్లిలో ముగ్గురి మధ్య..


డాక్టర్ కోడెల దివంగతులై మూడున్నరేళ్లు అయ్యింది. ఆయన కుమారుడు డాక్టర్ కోడెల శివరామకృష్ణ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను ఆశిస్తున్నారు. ఆయన తండ్రి స్పీకర్‌గా వ్యవహరించినప్పుడు నియోజకవర్గంలో క్రియాశీలకంగా ఉన్నారు. జిల్లాలోనే సీనియర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన డాక్టర్ కోడెల కుమారునికి, కానిపక్షంలో ఆయన కుటుంబీకుల్లో ఆసక్తి ఉన్న వారికి బాధ్యతలను అప్పగించవచ్చు. అలా చేయలేదు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు సైతం ఇన్‌చార్జి బాధ్యతలను ఆశిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. తెలుగు యువత నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు (అబ్బూరి మల్లి) కూడా కార్యక్రమాలను నిర్వహిస్తూ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలకు తానూ పోటీలో ఉన్నట్లు వల్లె వేస్తున్నారు. తమవైపు ఏదోరోజు అధిష్టానం చూడకపోతుందా? అన్న ఆశతో ఈ ముగ్గురు క్యాంటీన్లను తమదైన రీతిలో నెట్టుకొస్తున్నారు. చంద్రబాబు ఆశీస్సులు తనకంటే తనకేనని ఇద్దరు అంటుంటే.. కాదు లోకేష్ ప్రోత్సాహం తనకేనంటూ మరొకరు ఎవరి



స్థాయిలో వారు నియోజకవర్గ నాయకులు, శ్రేణుల వద్ద చెప్పుకుంటున్నది బహిరంగ రహస్యమే. ఓ వైపు గ్రూపుల మధ్య రచ్చను రాజేస్తూనే మరోవైపు రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు నేతృత్వంలో పరిశీలక కమిటీని నియమించడం తమ అధినేతకే చెల్లిందని వ్యాఖ్యానిస్తున్నారు. కమిటీ ఎదుటే వర్గాలుగా విడిపోయి గొడవ పడటం, సమావేశం రసాభాసగా మారడం పార్టీ నాయకులు, శ్రేణులకు తెలిసిందే. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సమక్షంలో జరిగిన సమావేశమే నామ్‌కే వాస్తేగా మిగలడం, ఇదంతా అధినేత డైరెక్షన్‌లో నడిచిందనే వ్యాఖ్యలు అప్పట్లోనే వినిపించాయి. ఎవరి రాక కోసమో ఎదురు చూస్తూ, వారికి సీటు రిజర్వు చేసే ఉద్దేశంతో ఇలా తమ మధ్య తగవులను ప్రోత్సహించడం, పార్టీ నాయకులు, క్యాడర్‌లో పలుచన చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ముఖ్యుల నుంచి వస్తోంది.

గుంటూరు వెస్ట్‌లోనూ..

సత్తెనపల్లిలోనే కాదు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనూ ఇవే తరహా పరిస్థితులు కొనసాగుతున్నాయని పార్టీ ముఖ్యులు గుర్తుచేస్తున్నారు. రాజకీయ పొత్తుల్లో భాగంగా కాని, కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి సర్దుబాటు చేయడానికో ఈ స్థానాన్ని కూడా అధిష్టానం ఎటూకాకుండా చేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రాభివృద్ధికి వ్యతిరేకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తున్న వైనం, చంద్రబాబు తీరు నచ్చక టీడీపీ నుంచి గెలుపొందిన మద్దాళి గిరిధరరావు కొంతకాలానికే ఆ పార్టీకి దూరమయ్యారు. అప్పటి నుంచి నియోజకవర్గ బాధ్యతలను కోవెలమూడి రవీంద్రకు అప్పగించినప్పటికీ వర్గాలను మాత్రం ప్రోత్సహిస్తోందని పార్టీ నాయకులే గుర్తుచేస్తున్నారు. స్వయంగా చంద్రబాబే స్వచ్ఛంద కార్యక్రమాల ముసుగులో ఉయ్యూరు శ్రీనివాస్ అనే ప్రవాసాంధ్రునితో చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించారని అంటున్నారు. అందులో తొక్కిసలాట జరిగి ముగ్గురు పేద మహిళలు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి జిల్లాలోని సీనియర్లు కూడా అంటీముట్టనట్లు ఉండాల్సి వచ్చింది. మరోవైపు డాక్టర్ నిమ్మల శేషయ్యను ప్రోత్సహిస్తున్నారని పార్టీ నగర నాయకులు గుర్తుచేస్తున్నారు. భాష్యం విద్యా సంస్థలకు చెందిన ప్రవీణ్‌ను కూడా ప్రోత్సహిస్తోందని పార్టీ నాయకులు చెబుతున్నారు. హోర్డింగ్‌లతో నగరంలో ప్రచారం హోరెత్తిస్తున్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా గుంటూరుకు మాత్రమే నగర పార్టీ కమిటీ ఉంది. డేగల ప్రభాకర్‌ను నగర అధ్యక్షుడిగా చేయడం, ఆయననూ ఓ ఆశావహునిగా కొనసాగింపజేయడం అధిష్టానానికే సాధ్యమవుతోందంటున్నారు. కోవెలమూడి రవీంద్ర ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నా పశ్చిమంలోని సీనియర్లయిన యాగంటి దుర్గారావు, కొమ్మినేని ప్రసాద్,



కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షుల సహకారం లేదనేది శ్రేణులందరికీ స్పష్టంగా తెలుసు. చివరకు నగరపాలక సంస్థలో పార్టీ సహచర కార్పొరేటర్ల నుంచి కూడా ఏమాత్రం సహకారం లేదని కోవెలమూడి ఆవేదన వ్యక్తం చేయడం రివాజే. ఇక్కడ కూడా సత్తెనపల్లి తరహా ఎత్తుగడే. చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు ఆశీస్సులు నాయకులకు వేర్వేరుగా ఉంటున్నందున ఎవరి స్థాయిలో వారు గ్రూపు రాజకీయాలను కొనసాగిస్తున్నారు. నాయకుల మధ్య విభజించు పాలించు అనే సూత్రాన్ని అధినేతే అమలుపరుస్తున్నప్పుడు భవిష్యత్తులో తమ నియోజకవర్గాలకూ వ్యాపించదనే గ్యారంటీ ఏమిటనే అనుమానాలు సీనియర్లలోనూ తలెత్తుతున్నాయని జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. 'ఈ దఫా సీటు ఉండకపోవచ్చనే పుకార్లు పైస్థాయిలో నుంచే మొదలవుతాయి. చివరి క్యాడర్ వరకు అవి వ్యాపిస్తాయి. మీ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు ఉన్నాయంటూ మొదటికే మోసగించేలా ప్లాన్ చేసి అమలుచేయడం అలవాటే' అంటూ అధినేత తీరును దుయ్యబడుతున్నారు. 'నియోజకవర్గంలో ఏదైనా సమస్య ఉందనిపిస్తే తక్షణం సరిచేయాలి. లేదా సర్దుబాటు అయినా చేసేయాలి. ఇతర పార్టీలు ఎలా చేస్తున్నాయో చూసైనా తెలుసుకోవాలి. నలభై ఏళ్ల అనుభవమని చెప్పుకోవడానికే సరిపోతోంది' అని నగరానికి చెందిన సీనియర్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు.

బిల్లులు అప్‌డేట్ చేస్తే వెంటనే నిధులు

ఏపీ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చింతా విజయప్రతాప్‌రెడ్డి

సత్తెనపల్లి: పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి బిల్లులు సకాలంలో అప్‌డేట్ చేస్తే ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేస్తుందని ఏపీ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చింతా విజయ్‌ప్రతాపరెడ్డి తెలిపారు. సత్తెనపల్లి మండలం నందిగామలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలు, రెండు ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, నందిగామ అడ్డరోడ్డులోని ఎండీయూ పాయింట్, పట్టణలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సత్తెనపల్లిలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనానికి సంబంధించి ప్రతి నెల 10వ తేదీకల్లా బిల్లులు అప్‌డేట్ చేస్తే 15వ తేదీ నాటికి ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుందన్నారు. తప్పు మన వైపు ఉంచుకొని ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేయడం లేదనడం సరికాదని చెప్పారు. పేద బాలల కోసం పోషక విలువలుగల పోర్టిఫైడ్ రైసును ప్రభుత్వం అందిస్తోందని




కోడిగుడ్లు తూకం వేస్తున్న ఏపీ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చింతా విజయప్రతాప్‌రెడ్డి

తెలిపారు. అధికారులు ఎవరు తప్పు చేసినా తక్షణమే సస్పెండ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం అమలులో లోటుపాట్లను సవరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.శోభారాణిని ఆదేశించారు. ఏదైనా సమస్య ఎదురైతే తన వాట్సాప్ నంబర్ 94905 51117, టోల్‌ఫ్రీ నంబర్ 155235కు తెలియజేయాలన్నారు. ఆయన వెంట డీఎస్‌ఓ మోహన్‌రావు, పౌరసరఫరాల శాఖ పల్నాడు జిల్లా మేనేజర్ వరలక్ష్మి, సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేయండి

- కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతం చేసిన అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేత
- జనవరి నెల నేర సమీక్ష చేసిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు అడ్మిన్ ఎస్పీ జి.బిందుమాధవ్‌తో కలిసి గ్రేవ్– నాన్‌గ్రేవ్, ప్రాపర్టీ, చీటింగ్ కేసులు, 174 సీఆర్‌పీసీ, పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, విజిబుల్ పోలీసింగ్ అంశాలపై జనవరి నెలకు సంబంధించిన సమీక్ష నిర్వహించారు. మహిళలపై నేరాల కేసులు, పోక్సో కేసుల్లో త్వరగా దర్యాప్తు పూర్తిచేసి నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి తగిన సాక్ష్యాధారాలతో నేరస్తులకు శిక్షపడే విధంగా చేయాలన్నారు. దొంగతనాలపై దృష్టి సారించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను త్వరగా పట్టుకొని చోరీ సొత్తును రికవరీ చేయాలన్నారు. ప్రతి అధికారి తమ స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి సారించి, ఆ గ్రామాలను తరచూ సందర్శిస్తూ పరిస్థితులు, పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టి శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా, ఫ్యాక్షన్ గొడవలు తలెత్తకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రమాదాలు



నేర సమీక్షలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, పక్కన అదనపు ఎస్పీ బిందుమాధవ్

జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రికలను ఏర్పాటు చేసి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, దిశ యాప్ వినియోగం, మహిళల చట్టాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని, కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలతో మంచి సంబంధాలు కలిగిఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం, క్రమశిక్షణ రాహిత్యం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవసరమైతేనే తప్ప విచారణ పేరుతో ఎవరినీ స్టేషన్‌కు పిలిపించవద్దని సూచించారు. 41ఏ నోటీసులు జారీ చేసేటప్పుడు అధికారులు తప్పనిసరిగా సుప్రీంకోర్టు ఉత్తర్వులు పాటించాలని చెప్పారు. కోటప్పకొండ తిరునాళ్లను విజయవంతం చేసిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డీఎస్పీలు సి.విజయభాస్కరరావు, బి.ఆదినారాయణ, జయరాంప్రసాద్, దిశా డీఎస్పీ యు.రవిచంద్ర, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ షాఫ్రుద్దీన్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బడి తెరిచిన రోజే 'కానుక'

- 2023-24 ఏడాదికి జేవీకే కిట్ల పంపిణీకి సిద్ధమవుతున్న సమగ్రశిక్ష అధికారులు
- 3,05,508 మంది బాలబాలికలకు లబ్ధి
- వ్యక్తిగతంగా విద్యార్థుల అవసరాలు, కొలతలు సేకరించిన అధికారులు
- ప్రస్తుత విద్యా సంవత్సరంలో 100 శాతం జేవీకే కిట్ల పంపిణీ పూర్తి
- జేవీకే కిట్ల నిల్వ, రవాణాకు జిల్లా, మండల స్థాయిలో కమిటీల ఏర్పాటు చేస్తున్నామన్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

పాఠశాలల్లో పిల్లల నమోదును గణనీయంగా పెంచడం.. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడింపజేయడం.. మెరుగైన ఫలితాలు సాధించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది ప్రణాళిక ప్రకారం అందరికీ అందించిన జిల్లా యంత్రాంగం వచ్చే విద్యాసంవత్సరం సైతం పాఠశాలల ప్రారంభం రోజే అందించేలా పక్కా ఏర్పాట్లు చేస్తోంది...

సాక్షి, నరసరావుపేట: విద్యాసంవత్సరం ఆరంభంలో పిల్లలను బడికి సమయంలో ఇబ్బంది పడే పేదింటి అక్కచెల్లెమ్మల కష్టాలను తీర్చడంతో పాటు, పాఠశాలల్లో డ్రాప్ అవుట్‌లను గణనీయంగా తగ్గించి బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడమే లక్ష్యంగా 'జగనన్న విద్యా కానుక'ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ప్రత్యేక స్కూల్ కిట్‌లు అందజేస్తోంది. విద్యార్థులకు వారి విద్యాభ్యాసానికి అవసరమైన ఏడు రకాల వస్తువులను ఈ కిట్ల రూపంలో ఉచితంగా అందిస్తున్నారు. ప్రస్తుత ఏడాది వంద శాతం జేవీకే కిట్ల పంపిణీ పూర్తి చేశారు. ప్రతి ఒక్కరి బయోమెట్రిక్ తీసుకొని పంపిణీ చేయడంతో ఎక్కడా అవకతవకలకు ఆస్కారం లేకుండా పోయింది.

3,05,508 కిట్‌లకు ప్రతిపాదనలు...

అన్ని తరగతుల విద్యార్థులకు బడులు తెరచిన మొదటి రోజే విద్యా కానుక కిట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వ ఉద్దేశం. అందులో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం తొలి రోజే కిట్‌లను అందించేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా వచ్చే ఏడాదికి అవసరమయ్యే విద్యాకానుక ప్రతిపాదనలను విద్యా శాఖ సిద్ధం చేసింది. 2023–24 విద్యా సంవత్సరానికి జిల్లాకు 3,05,508 జగనన్న విద్యాకానుకలు అవసరమవుతాయని ప్రాథమిక అంచనాకు వచ్చారు. తరగతుల వారీగా, బాలబాలికల వారీగా అర్హుల జాబితా సిద్ధం చేశారు. వచ్చే ఏడాదిలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో చేరినా ఇబ్బంది లేకుండా వీటికి తోడు అదనంగా మరి కొన్ని జేవీకే కిట్లను జిల్లాకు పంపనున్నారు.

కిట్‌లో ఏడు రకాల వస్తువులు...

జగన్న విద్యాకానుక కిట్‌లో స్కూల్ బ్యాగ్, నోట్ పుస్తకాలు, షూస్, 2 జతల సాక్సులు, 3 జతల యూనిఫాం, బెల్టు అందజేయనున్నారు. యూనిఫామ్ కుట్టు కూలీ తల్లుల అకౌంట్‌కే నేరుగా జమ



జగనన్న విద్యా కానుక కిట్లు

చేస్తారు. స్కూల్ కిట్‌కు సంబంధించిన వస్తువుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడలేదు. అత్యంత పారదర్శకంగా రివర్స్ టెండరింగ్, ఈ–ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సేకరించారు. వీటికి తోడుగా అదనంగా ఇంగ్లిష్– తెలుగు డిక్షనరీని విద్యార్థులకు అందజేస్తున్నారు. ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఇది ఎంతగానో ఉపయోగకరంగా ఉంటోంది. ప్రతి రోజు డిక్షనరీ సహాయంతో విద్యార్థులకు కొత్త ఆంగ్ల పదాలను ఉపాధ్యాయులు నేర్పాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నోట్ పుస్తకాలు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు పంపిణీ చేస్తారు.


జిల్లా, మండల స్థాయిలో కమిటీల ఏర్పాటు..

జేవీకే కిట్ల పంపిణీ బడులు తెరవకముందే పాఠశాలలకు అందేలా విద్యాశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా జిల్లా, మండల స్థాయిలో ముగ్గురు సభ్యులతో కమిటీలు వేసి వారికి బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఈ కమిటీ కిట్ల రాక, ప్రతి రోజు ఎన్ని కిట్లు ఏ పాఠశాలకు వెళుతున్నాయో పరిశీలించాల్సి ఉంటుంది.

వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాలో తరగతుల వారీగా జేవీకే కిట్లు పొందే విద్యార్థులు

తరగతి	బాలురు	బాలికలు	మొత్తం
1వ తరగతి	13,896	12,494	26,390
2వ తరగతి	13,896	12,494	26,390
3వ తరగతి	14,447	12,787	27,234
4వ తరగతి	16,887	15,363	32,250
5వ తరగతి	18,265	16,341	34,606
6వ తరగతి	17,964	16,336	34,300
7వ తరగతి	17,033	15,255	32,288
8వ తరగతి	16,661	14,861	31,522
9వ తరగతి	16,200	15,140	31,340
10వ తరగతి	15,083	14,105	29,188
మొత్తం	1,60,332	1,45,176	3,05,508

విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పంపిణీ...



2023–24 విద్యా సంవత్సరం పాఠశాలలు ప్రారంభమైన తొలి రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకు తగ్గట్టుగా ఇప్పటికే జిల్లాలో అర్హులైన బాలబాలికల జాబితాలు సిద్ధమయ్యాయి. వచ్చే ఏడాదికి 3,05,508 మందికి విద్యాకానుక కిట్లు అందనున్నాయి. జిల్లా, మండల స్థాయి కమిటీలు వేసి కిట్ల నిల్వ, పంపిణీకి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్.

రొంపిచర్ల పాఠశాలను సందర్శించిన జేసీ


పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ గురువారం సందర్శించారు. రెండు సెక్షన్లలోని పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. బాగా చదివి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని జేసీ విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో మౌలిక వసతులు, తరగతి గదుల సంఖ్యను హెచ్ఎం మొహిద్దీన్ సాహెబ్‌ను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలోని తరగతి గదులు అందుబాటులోకి వస్తే సమస్య పూర్తిగా తీరుతుందన్నారు. శిథిలావస్థలోని తరగతి గదులను తొలగించాలని సూచించారు.

ప్రత్యేకావసరాలు గల పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వ సహాయం, దాతల సహకారంతో ఉచితంగా వైద్య పరికరాలు అందజేస్తున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు అందజేసేందుకు వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. శిబిరానికి నరసరావుపేట డివిజన్ పరిధిలోని 11 మండలాలకు చెందిన 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. కలెక్టర్ ఎల్.శివశంకర్ శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. వైద్య పరికరాల నిమిత్తం ప్రభుత్వం విడుదల చేసిన రూ.2.9లక్షల్లో ఒక్కో మండలానికి రూ.10వేలు కేటాయించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 380 మంది పిల్లలకు ఉపకరణాలు అందిస్తామన్నారు. ఇప్పటికే సత్తెనపల్లి, పిడుగురాళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించి, వైద్య పరికరాలు అందించేందుకు పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వారు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. 70 పిల్లలకు వినికిడి కిట్లు, మరో 30 మందికి వీల్‌చైర్స్, మరికొందరికి ఎమ్మార్ కిట్లు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె.జ్యోతికిరణ్, ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ కేఏస్ దయానిధి, సమగ్ర శిక్ష ఏఎంఓ పి.శ్రీనివాసరావు, ఏఎల్ఎస్‌సీ కె.శ్రీనివాసరావు, సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ టి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మీరు చేయాల్సింది బాగా చదువుకోవడమే..

విద్యార్థులతో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సి.విజయ్‌ప్రతాప్‌రెడ్డి


కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి

క్రోసూరు: 'మీ జగన్ మామయ్య.. మీకు కావాల్సినవన్నీ అందిస్తున్నాడు. ఇక మీరు చేయాల్సిందల్లా బాగా చదువుకోవటమే.' అని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సి.విజయ్‌ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం క్రోసూరు జెడ్పీ ఉన్నత పాఠశాల బీసీ బాలుర హాస్టల్, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. నాణ్యమైన భోజనం అందేలా చూసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనకు బాధ్యతలు అప్పగించారని, త్వరలో మరో ఐదుగురు ఆ బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. భోజనం నాణ్యతలో సమస్యలుంటే తనకు ఫోన్ చేయొచ్చని చెప్పారు. అందుకు సంబంధించిన పోస్టర్లను పాఠశాలల్లో అంటించామన్నారు. ప్రభుత్వం వచ్చే జూన్ నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు రాగి మాల్ట్ పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల స్టోర్ రూంలలో ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పి.స్వర్ణకుమారి కోడిగుడ్ల సరఫరా, వాటి పరిమాణం తదితర సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో పరిష్కారిస్తామని ఆయన సమాధానం ఇచ్చారు. చైర్మన్ వెంట తహసీల్దార్ డి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య, ఎంఈఓ ఏసుతర్నం, బీసీ బాలుర వార్డెన్ రత్తయ్య, మోడల్ స్కూల్ ప్రిన్స్‌పల్ ప్రతిష్ట, ఇన్‌చార్జి ప్రిన్స్‌పల్ శౌరీరాజు, కేజీబీవీ ప్రిన్స్‌పల్ ఇందిరా ప్రియదర్శిని, క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ బి.మాధవి, అధికారులు ఉన్నారు.

ఏసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలి

గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య


దైవ సందేశం ఇస్తున్న గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

విజయపురిసౌత్: ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య పేర్కొన్నారు. గురువారం సాగర్‌మాత మహోత్సవాలు మూడవ రోజు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, భక్తులకు దైవ సందేశమిచ్చారు. క్రీస్తును విశ్వసించి, అంగీకరిస్తే దేవుని రక్షణ కలుగుతుందన్నారు. మానవాళికి ఆదర్శంగా జీవించిన మేరిమాతను మార్గదర్శిగా తీసుకోవాలని సూచించారు. విశ్వ క్రైస్తవ స్త్రీ సభలో తొలి క్రైస్తవరాలిగా దైవ మార్గంలో నడిచిన మేరిమాతను కొలుస్తారని పేర్కొన్నారు. సాగర్‌మాత, మరియమాత, వేళంగిమాత, లూర్థుమాత, ఫాతిమామాత, గుణదలమాతగా విశ్వంలో వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తూ కొనియాడబడుతోందన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన గేటుకు ఇరువైపులా నిత్య సహాయమాత, వేళంగిమాత విగ్రహాలను ప్రారంభించారు. అనంతరం సాగర్‌మాత కళావేదికపై నిర్వహించిన సమష్టి దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతి దైవ సందేశం ఇచ్చారు. సాయంత్రం 6గంటలకు పుర వీధుల్లో సాగర్‌మాత తేరు ప్రదక్షిణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్, పెద్దలు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, జెక్కిరెడ్డి చిన్నపరెడ్డి, ఎం.జోషి, మరియదాసు, కె.శౌర్రాజు, కట్టారాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తాం

వాణిజ్య విభాగం జోనల్ ఇన్‌చార్జి మాశెట్టి వెంకటేశ్వర్లు



దాచేపల్లి: వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల జోనల్ వాణిజ్య విభాగం పార్టీ ఇన్‌చార్జి మాశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. దాచేపల్లిలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. ప్రజలకు అందుతున్న లబ్ధిని వివరించి, మరోసారి సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరతామని ఆయన చెప్పారు. పార్టీలో అందరిని కలుపుకుని పనిచేస్తానని, తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాభ్యుదయమే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి


విలేజ్ క్లినిక్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కారెంపూడి: గ్రామాభ్యుదయమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కారెంపూడి మండలంలోని చినకొదమగుండ్ల గ్రామంలో రూ.17.80 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ.. విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటికొచ్చి వైద్యం అందించే విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. ప్రజలు తమ పనులు మానుకుని కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం గడప వద్దకే సేవలు అందిస్తోందని చెప్పారు. ఇలా గ్రామాభ్యుదయాన్ని కాంక్షిస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా మన్ననలు పొందుతున్నాయని తెలిపారు. అనంతరం గ్రామంలో కల్యాణ మండపం నిర్మాణానికి పిన్నెల్లి భూమిపూజ చేశారు. గ్రామంలో సచివాలయం, విలేజ్ క్లినిక్, ఆర్బీకే ఏర్పాటుతో పాటు రూ.33 లక్షలతో సీసీ, మెటల్ రోడ్లు వేసి, పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన పీఆర్కేను గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యర్రంరెడ్డి వీరారెడ్డి, వెన్నా శ్రీనివాసరెడ్డి, యర్రంరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల మహిళా కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర డేవిడ్, జెడ్డా కోటిరెడ్డి, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, మాజీ ఎంపీపీ పంగులూరి చిన వెంకటనర్సయ్య, షేక్ అక్బర్, మందాళ్ల అంజిరెడ్డి, క్రిష్టపాటి అంకిరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, బైరెడ్డి కోటిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

డీఈఓ వెంకటప్పయ్యను తొలగించాలి..

ఉపాధ్యాయ సంఘ నాయకుల నిరసన


ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సత్తెనపల్లి: అసభ్యకర పదజాలంతో దురుసుగా ప్రవర్తిస్తున్న పల్నాడు డీఈఓని బాధ్యతల నుంచి తొలగించాలని పల్నాడు జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య పిలుపు మేరకు సత్తెనపల్లి ఎమ్మార్సీ కార్యాలయం వద్ద గురువారం ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సమీక్ష సమావేశాల పేరుతో డీఈఓ మేకతోటి వెంకటప్పయ్య అసందర్భంగా 'యూజ్‌లెస్ ఫెలోస్', 'ఉపాధ్యాయులు అంటేనే నాకు ఎలర్జీ', 'నేనే ముఖ్యమంత్రి అయితే 70 శాతం జీతం కట్ చేస్తాను' అని అనడం ఉపాధ్యాయులను అవమానించడమేనన్నారు. మహిళా ఉపాధ్యాయులున్నా.. ఎవరూ వాడని బాష, పరుష పదజాలం ఉపయోగించడం డీఈఓకి పరిపాటిగా మారిందని ఆరోపించారు. వెంకటప్పయ్యను డీఈఓ బాధ్యతల నుంచి తొలగించే వరకు ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జిల్లా అధికారులకు పలు సూచనలు చేసిన కలెక్టర్ ఎల్.శివశంకర్


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వారందరికీ తప్పనిసరిగా 'అల్బెండజోల్' మాత్రలు అందించాలన్నారు. మార్చి 14న జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలు, వసతి గృహాలు, గురుకుల, ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో తప్పనిసరిగా విద్యార్థులకు మాత్రలు వేయాలని స్పష్టం చేశారు. సచివాలయ స్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. పల్నాడు జిల్లాలో ఏడాది నుంచి 19ఏళ్ల లోపు వారు 4,21,571 మంది ఉన్నారని, వారిలో అంగన్వాడీ కేంద్రాల్లో 87,219 మంది, మొత్తం పాఠశాలల్లో 3,03,882 మంది, జూనియర్ కళాశాలల్లో 30,530 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించే బాధ్యతను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలకు అప్పగించినట్లు కలెక్టర్ వెల్లడించారు. సచివాలయం పరిధిలో పంచాయతీ, సంక్షేమ, ఎడ్యుకేషన్ కార్యదర్శులు, మహిళా పోలీస్ ప్రతి ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేయించే బాధ్యతను తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ఒక మెడికల్ ఆఫీసర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. వందశాతం లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో మిగిలిపోయిన వారికి మార్చి 18న మాత్రలు వేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారిణి డాక్టర్ జి.శోభారాణి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబుల్ నాయుడు, డీఈఓ వెంకటప్పయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి వరలక్ష్మి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.